


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 320 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 22 జూలై 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :320 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 22 JULY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

- కాకినాడ పోర్ట్ పరిసరాల్లో 'NBK111' షూటింగ్
- యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా కాలుజారి కిందపడ్డ బాలయ్య
- గాయం స్వల్పమైనదేనని ప్రకటించిన వైద్యులు

- మిగతా 2లో



### సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి

## నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

- యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స
- కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని వెల్లడి
- స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి దోపిడీ చేస్తున్నారని ఆరోపణ

2లో






### ప్రధాని మోదీ నివాసం వద్ద

# హైడ్రామా..

## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

- మిగతా 2లో

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.



# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..

## దావోస్ ఒప్పందానికి కీలక ముందడుగు

- దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రం లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటె డ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళ వారం రాష్ట్ర సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావడంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయను న్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరు స్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసె సింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.





## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

### నిమ్మల రామానాయుడు

- వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల
- నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని వ్యాఖ్య

- మిగతా 2లో



### మంగళగిరిలో నారా లోకేశ్

## 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ మాట మార్చారు



### కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

- నీట్‌పై చర్చ విషయంలో రాహుల్ గాంధీ మాట మార్చారని కేంద్రం ఆరోపణ
- ప్రధాని నివాసం సమీపంలో కాంగ్రెస్ నిరసన.. పాల్గొన్న రాహుల్, ప్రియాంక
- ధర్నా వద్దకు వెళ్లి రాహుల్‌తో మాట్లాడిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- మంత్రుల రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్.. చర్చలు విఫలమయ్యాయని ప్రకటన

- మిగతా 2లో

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

### సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

- భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు
- దీని వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని వ్యాఖ్య
- జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన అంశమన్న సుప్రీంకోర్టు

- మిగతా 2లో



# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..!

## ఎడిటర్ వ్యూ

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. "ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం" అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు.ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు.2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం


నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.

## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

### అయ్యవారి బాగోతాలు - 4

- అద్దెకు ఇల్లు ఇచ్చాడు.. చివరకు శవమై మిగిలాడు..!
- నిడదవోలు అద్దె ఇంటి నుంచి మొదలైన వివాదం.. భీమడోలు వరకు సాగుతున్న ఆరోపణల నీడ
- పత్రాలు ఎక్కడ..? కలప సామగ్రి ఏమైంది..?
- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయా..?
- "ఏం చేయాలో అదే చేస్తా" అన్న బెదిరింపుల వెనుక నిజమెంత..?
- ఇంటి యజమాని మృతి.. మిస్టరీగా మిగిలిన ప్రశ్నలు
- ఆ మరణంపై సమగ్ర విచారణ జరిగితే.. మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయి..?
- లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగవన్న ఆరోపణలు.. సమగ్ర దర్యాప్తుకు బాధిత ప్రజల డిమాండ్




**అద్దెకు ఇల్లు ఇచ్చాడు. ప్రభుత్వ అధికారి కాబట్టి పర్వాలేదనుకున్నాడు. తన ఇంట్లోకి వచ్చిన వ్యక్తిని నమ్మాడు. తన పొలం పత్రాలు రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చాడు , కానీ ఆ నమ్మకమే చివరకు తన కుటుంబానికి కన్నీటి కథగా మిగిలిందా..? ఇంటి నుంచి విలువైన కలప సామగ్రి మాయమైందని ఆరోపణలు. భూమికి సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వలేదన్న వాదనలు. దీనిపై అధికారులను ఆశ్రయించినా స్పందన లేదన్న ఆవేదన. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నట్లుగా బెదిరింపులు ఎదురయ్యాయన్న బాధిత కుటుంబం వాంగ్మూలం. ఆ తర్వాత.. ఇంటి యజమాని మృతి. ఇది సాధారణ మరణమా..? లేక తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులు, అవమానాలు, న్యాయం కోసం చేసిన పోరాటం మధ్య చోటుచేసుకున్న అనుమానాస్పద మరణమా..? ఇదే ఇప్పుడు అందరికీ మిస్టరీగా మారిన ప్రశ్న.**

**ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు/భీమడోలు, జూలై 21:**



వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్‌పై సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. గతంలో వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో నిడదవోలులోని అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చింది. వివాహేతర సంబంధం, ఇంటి సామగ్రి చోరీ, భూమి పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడం, ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు, అవినీతి ఆరోపణలు వంటి పలు అంశాలను ఇంటి యజమాని కుటుంబ సభ్యులు పెన్ పవర్ ఎదుట వెల్లడించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిడదవోలుకు చెందిన లేటు జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం కుటుంబ సభ్యులు జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించిన ఫిర్యాదు, బాధితురాలు జయమ్మ వెల్లడించిన వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.


**అద్దె ఇంటి నుంచే వివాదానికి బీజం..? :** ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం భార్య జయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో నిడదవోలులోని అల్లూరి సీతారామరాజు వీధిలో ఉన్న తమ ఇంటిని అద్దెకు తీసుకున్నారని తెలిపారు. అద్దెకు దిగే సమయంలో తాను తన భార్యతో కలిసి నివసిస్తానని చెప్పినప్పటికీ, అనంతరం శోభారాణి అనే మహిళతో కలిసి ఇంటిలో నివసించారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై తమ కుటుంబంలో వివాదం తలెత్తిందని, అనంతరం అద్దె ఇంటిలోని విలువైన కలప సామగ్రి, ఇతర వస్తువులు కనిపించకుండా పోయాయని జయమ్మ ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన పొలాల పత్రాలను కూడా తీసుకెళ్లి ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని ఆమె వాపోయారు.

**"పత్రాలు తీసుకెళ్లారు.. తిరిగి ఇవ్వలేదు" :** తమ భూములకు సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని జయమ్మ ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న చోరీపై కూడా జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తమ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించినా స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన తర్వాత తమ కుటుంబంపై ఒత్తిళ్లు పెరిగాయని, ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వచ్చినట్లు ఆమె ఆరోపించారు.

**"కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నారా..? :** తమ కుటుంబం చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ నుంచి బెదిరింపులు వచ్చాయని జయమ్మ ఆరోపించారు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అంటూ బెదిరించారని ఆమె పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన భర్త జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఆ తర్వాత ఆయన మరణించారని జయమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్త మరణానికి ముందున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె కోరారు. అయితే, బెదిరింపుల కారణంగానే ఆయన మృతి చెందారనే ఆరోపణకు సంబంధించి అధికారిక దర్యాప్తు ద్వారా వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది.

**జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు.. అయినా చర్యలేవీ లేవా..? :** అద్దె ఇంటిలో దొంగతనం జరిగిందంటూ ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదులో ఇంటి నుంచి వస్తువులు తీసుకెళ్లడం, పత్రాలు తిరిగి ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రస్తావించినట్లు వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత శాఖ నుంచి తగిన స్థాయిలో స్పందన రాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? విచారణ జరిగిందా..? ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై శాఖాపరంగా ఏమైనా నివేదిక రూపొందించారా..? అన్న విషయాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

**అధికారిక విధుల్లోనూ అవినీతి ఆరోపణలు..? :** ఇదిలా ఉండగా, వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ గతంలో అనంతపల్లి, వేగేశ్వరపురం ప్రాంతాల్లో పనిచేసిన సమయంలోనూ, ప్రస్తుతం భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయంతో కార్యాలయ వ్యవహారాలు సాగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల పాత్ర పెరిగిందని, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి




నిర్దిష్ట ఆధారాలు, అధికారిక విచారణ నివేదికలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**విచారణకు ప్రజల డిమాండ్ :** ఒక ప్రభుత్వ అధికారి చుట్టూ ఇంతటి తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్టాంపులు--రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు అద్దె ఇంటి వివాదం, ఇంటి సామగ్రి అదృశ్యం, భూమి పత్రాల వ్యవహారం, ఫిర్యాదు ఉపసంహరణకు వచ్చినట్లు చెబుతున్న బెదిరింపులు, ఇంటి యజమాని మృతికి ముందు జరిగిన పరిణామాలు, అలాగే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు-ఈ అంశాలన్నింటినీ విడివిడిగా కాకుండా సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. బాధిత కుటుంబం చేసిన ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అదే విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కొసమెరుపు ఏంటంటే**

వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ పనిచేసిన ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో ఒక ప్రైవేట్ మహిళ కీలక పాత్ర పోషిస్తుందనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరి దీనిపై ఉన్నత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే, అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు. అభిప్రాయ డుతున్నారు. ఒకవేళ ఆరోపణల్లో నిజానిజాలు ఉంటే ప్రభుత్వం విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు."

**అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో ఆంటీ... ఆ నలుగురు యవ్వారం... ఏంటో... చూద్దాం..? ఎపిసోడ్ 7 లో.**

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

- మొదటి పేజి తరువాయి

ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి.

చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు.నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు.మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు.పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు.

## రాహుల్ గాంధీ మాట మార్చారు

నీట్-యూజీ పరీక్ష వివాదంపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పినా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి నిమిషంలో మాట మార్చారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీంతోప్రతిష్టంభన ఏర్పడిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు రాహుల్ కట్టుబడలేదని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి కొత్త షరతులు పెట్టడంతో చర్చలు ముందుకు సాగలేదని ఆయన విమర్శించారు.

నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని ప్రధాని నివాసం సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ధర్నా ప్రారంభమైన గంట తర్వాత మంత్రి జితేంద్ర సింగ్ అక్కడికి చేరుకుని రాహుల్‌తో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. నీట్ అంశంపై చర్చ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందని, కానీ ఆ తర్వాత రాహుల్ గాంధీ మరో కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడంతో చర్చలు విఫలమయ్యాయని జితేంద్ర సింగ్ వివరించారు.

మరోవైపు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నీట్ వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో తమ నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ నేతలు ప్రకటించారు.

# నకిలీ నియామక ఉత్తర్వులపై అప్రమత్తంగా ఉండాలి

**'స్కిల్ ట్రీ' కన్సల్టెన్సీ పేరుతో జరుగుతున్న మోసాలను నమ్మొద్దు -- సమగ్ర శిక్ష హెచ్చరిక**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో "స్కిల్ ట్రీ " కన్సల్టెన్సీ పేరుతో వృత్తి విద్య (వొకేషనల్ ఎడ్యుకేషన్)లో వొకేషనల్ ట్రైనర్ నియామకాల పేరుతో నకిలీ నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ) తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని అన్ని మండల విద్యాశాఖాధికారులు, వివిధ యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నిరుద్యోగ యువతీయువకులు, అభ్యర్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదరు వ్యక్తులు ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు వసూలు చేసి నకిలీ నియామక ఉత్తర్వులు అందజేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు.జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఎస్ఈఓ), సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త (ఏపీసీ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ) అధికారిక ఆమోదం లేకుండా జారీ చేసిన ఎలాంటి వొకేషనల్ ట్రైనర్ నియామక ఉత్తర్వులు చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. అలాంటి ఉత్తర్వులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోవద్దని హెచ్చరించారు.అదేవిధంగా, ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం వృత్తి విద్యా కార్యక్రమం అమలులో లేదని, ఈ కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు మాత్రమే అమలులో ఉందని వివరించారు.కాబట్టి నిరుద్యోగ యువత, ఉద్యోగార్థులు, వారి తల్లిదండ్రులు అపరిచిత వ్యక్తులు లేదా కన్సల్టెన్సీల మాటలను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని సమగ్ర శిక్ష అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారం అందించినట్లయితే చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# జూలై 23లోగా ఓటర్ల జాబితా పెండింగ్ కేసుల పరిష్కారం పూర్తి చేయాలి

**ఏఈఆర్ఓలు, అదనపు ఏఈఆర్ఓలకు జిల్లా కలెక్టర్ నిషాంతి.టి ఆదేశాలు**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 21:**ఓటర్ల జాబితా సవరణ, శుద్ధీకరణ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను ఈ నెల జులై 23వ తేదీలోగా పూర్తిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంతి.టి అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు), అదనపు ఏఈఆర్ఓలను ఆదేశించారు. ఓటర్ల జాబితా పారదర్శకత, ఖచ్చితత్వం పెంపొందించే లక్ష్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఏఎస్‌డీడీ కేటగిరీలోని కేసులపై గైర్హాజరు ఓటర్లు, నివాసం మార్చుకున్న వారు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించి, అవసరమైన సవరణలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే డీఎస్ఈ కేసుల్లో ఒకే వ్యక్తి వివరాలు లేదా ఫొటోలతో వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల వివరాలను త్వరితగతిన పరిశీలించి, సంబంధిత దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు.మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, సాంకేతిక వ్యత్యాసాలు కూడా వెంటనే సరిచేయాలని, తద్వారా పోస్ట్-డ్రాఫ్ట్ నోటీసుల జారీని వీలైనంత వరకు తగ్గించాలని అధికారులకు సూచించారు.జులై 23 నాటికి ఒక్క కేసు కూడా పెండింగ్‌లో లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసిన కలెక్టర్, నిర్లక్ష్యం వహించే అధికారులపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సమక్షంలో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను అప్లోడ్ చేసే ముందు పూర్తిగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి ఆదేశించారు.

# పంచదార్లలో అక్రమ మైనింగ్‌పై వైఎస్సార్‌సీపీ ఆందోళన

**చలో పంచదార్ల నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి, పెన్ పవర్,జూలై 21:**అనకాపల్లి జిల్లా పంచదార్లలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమ మైనింగ్‌కు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "చలో పంచదార్ల" కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొమ్మిదో శతాబ్దానికి చెందిన తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మితమైన ఈ చారిత్రక శైవక్షేత్రం పరిసరాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. ఈ చర్యల వల్ల పవిత్ర జలధారలు కలుషితమవుతున్నాయని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, ప్రజల ఆస్తులు, సహజ వనరులు దెబ్బతింటున్నాయని విమర్శించారు.పవిత్ర పుణ్యక్షేత్ర పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదిమల్లు వంతెనకు అప్రోచ్ రోడ్డు లేక ప్రయోజనం శూన్యం





- **బురదమయమైన రహదారితో 20 గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం**
- **వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్**

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 21:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని మాదిమల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారిందని పీసా ఉపాధ్యక్షుడు కోయిలంగి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.దారకొండ--గుమ్మిరేవులు ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండగా, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి రహదారి పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. దీంతో రహదారిపై వాహనాలు జారిపడే పరిస్థితి నెలకొని, ఆర్టీసీ బస్సులు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు సైతం ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.రహదారి అధ్వాన్నంగా మారడంతో గుమ్మిరేవులు వరకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు ప్రస్తుతం మాదిమల్లు గ్రామం వరకే వెళ్లి తిరిగి వెనుదిరుగుతోందని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు అక్కడి నుంచి కాలినడకన తమ గ్రామాలకు చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.ఈ సమస్య కారణంగా గుమ్మిరేవులు, దారకొండ, పాతకోట గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 20 గ్రామాల ప్రజలకు రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, విద్యార్థుల విద్యాభ్యాసం, అత్యవసర వైద్య సేవలు, నిత్యావసర అవసరాలన్నీ ఇబ్బందులకు గురవుతున్నాయని ఆయన చెప్పారు. అత్యవసర వైద్య సేవలు కూడా పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.అసంపూర్తిగా వదిలేసిన అప్రోచ్ రోడ్డు పనుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, స్థానిక గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ స్పందించి మాదిమల్లు వంతెన అప్రోచ్ రోడ్డు పనులను నాణ్యతతో, అత్యవసరంగా పూర్తి చేసి ప్రజల రాకపోకలకు అనుకూలంగా మార్చాలని పీసా అధ్యక్షుడు కోయిలంగి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అలాగే గుమ్మిరేవులు, దారకొండ, పాతకోట గ్రామ పంచాయతీల ప్రజలు కూడా సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఎస్ఎస్ఎన్ నగర్‌కు శాశ్వత పరిష్కారం.. కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం :ఎమ్మెల్యే వెలవపూడి



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 21**: తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం లభిస్తోంది. 13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లో ఎన్నో ఏళ్లుగా స్థానికులను వేధిస్తున్న వర్షపు నీటి పారుదల, రాకపోకల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా 48 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ. వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు.జీవీఎంసీ ఈ ఈ గంగాధర్. ఏఇ భరత్. పోత్రకండ ధర్మారావు. తురకపూడి బాలస్వామి. మారిక జక్కన్న మజ్జి రమణి. బిజెపి నాయకులు కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం దొరకబోతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాత్రికేయుల హక్కుల సాధనే లక్ష్యంగా 'ఏపీయూడబ్ల్యూజే.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- **పాత్రికేయుల రక్షణ, పత్రికా స్వేచ్ఛకై దశాబ్దాల పోరాటం.**
- **మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిజంలో విలువలు కాపాడాలి.**
- **ఉత్సాహంగా చింతపల్లి ప్రింట్ మీడియా ఆత్మీయ సమ్మేళనం.**
- **ఏపీయూడబ్ల్యూజే యూనియన్‌లో చేరిన 20 మంది జర్నలిస్టులు.**

**చింతపల్లి పెన్ పవర్ జూలై 21.**

పాత్రికేయులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలిచి కాపాడే ఏకైక వేదిక యూనియన్ మాత్రమేనని, జర్నలిస్టుల హక్కుల సాధనలో, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంలో దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) కే దక్కుతుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బి.ఎల్. స్వామి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే చింతపల్లి ప్రింట్ మీడియా ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సి. బి. ఎల్.స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాత్రికేయుడు జి.సోమరాజు, కే. శ్రీనివాసరావు నేతృత్వంలో సుమారు 20 మంది జర్నలిస్టులు ఏపీయూడబ్ల్యూజేఎఫ్ నుండి వీడి రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఏపీయూడబ్ల్యూజేలో చేరారు. నూతనంగా చేరిన వారికి యూనియన్ నాయకులు సాదరంగా స్వాగతం పలికి సభ్యత్వాలను అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ , అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తో ఏపీయూడబ్ల్యూజేకు ఉన్న బలమైన అనుబంధాన్ని వివరించారు. దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఈ యూనియన్‌కు అనుబంధంగా మన రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ విజయవంతంగా కొనసాగుతుండటం గర్వకారణమన్నారు. పాత్రికేయుల వేతనాల పెంపు కోసం జాతీయస్థాయిలో వేజ్ బోర్డుల సాధనలోనూ, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి చట్టబద్ధమైన రక్షణ కల్పించడంలోనూ ఈ యూనియన్ దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. యాజమాన్యాల వేధింపుల నుంచి పాత్రికేయులను రక్షించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ఏపీయూడబ్ల్యూజే ఎప్పుడూ ముందువరసలో ఉంటుందని స్పష్టం చేశారు. కాలక్రమంలో జర్నలిజం రంగంలో వస్తున్న మార్పులను వారు విశ్లేషించారు. ఒకప్పుడు పత్రికలకే పరిమితమైన వార్తా పంపిణీ.. ఆ తర్వాత టెలివిజన్ వంటి ఎలక్ట్రానిక్ ఛానళ్ల రూపంలోకి, నేడు శరవేగంగా విస్తరిస్తున్న డిజిటల్ మీడియా వైపు రూపాంతరం చెందిందని గుర్తుచేశారు. గతం కంటే భిన్నంగా నేడు క్షణాల్లో వార్తలు సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికగా ప్రజలకు చేరుతున్నాయన్నారు. అయితే, ఈ వేగంలో గుడ్డిగా ఏది పడితే అది రాయడం సరికాదని, నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని సూచించారు. ఎంత సాంకేతికత పెరిగినా జర్నలిజం విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వారు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా ఏపీయూడబ్ల్యూజే పనిచేస్తోందని నాయకులు ఉద్ఘాటించారు. అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమాతో పాటు వృద్ధాప్యంలో పింఛను సదుపాయం వంటివి సాధించడంలో యూనియన్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఏజెన్సీ ప్రాంతాలైన పాడేరు, చింతపల్లి, అరకు తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన పాత్రికేయ మిత్రులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో యూనియన్ మరింత బలోపేతం కావడానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సభ్యులందరి ఐక్యత, సహకారం ఎంతో అవసరమని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుని తరలించవద్దని గ్రామస్తుల నిరసన

- 10 గ్రామాల నుండి 72 మంది విద్యార్థిని విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులతో కొనసాగుతున్న పాఠశాల.
- విద్య బోధనకు సరిపడ్డ సిబ్బంది లేకుంటే విద్యార్థుల భవిష్యత్తు పాడవుతుందని ఆవేదన.
- డిప్యూటేషన్ నిలుపుదల చేయకపోతే విద్యాశాఖ కార్యాలయంలో నిరసన చేపడతామన్న విద్యార్థుల తల్లిదండ్రులు.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 21.** మండలంలో గల పనసపుట్టు పంచాయతీ, కడుతుల గ్రామంలోనీ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చెండా దయనిదిను ఇతర పాఠశాలకు డిప్యూటేషన్ పై తరలించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మండల విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం పాఠశాలలో అత్యవసర పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఉపాధ్యాయులతో డిప్యూటేషన్ పై వెళ్తున్న ఉపాధ్యాయునీ కొరకు చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి కమిటీ చైర్మన్ కిరసాని విగ్నేష్, పాఠశాల కమిటీ సభ్యులు సీసా రఘురాం, కిముడు రామరాజు, కిరసాని రాజేష్, కిరసాని రామనాయుడు మాట్లాడుతూ.. కడుతుల పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కలిసి తమ సొంత డబ్బులు కేటాయించి నాలుగు గదులు గల రేకు షెడ్లను నిర్మించామన్నారు. ఆదర్శ పాఠశాలగా ఉన్నా ఇప్పుడిప్పుడే విద్యార్థులు గాడిలో పడుతున్న క్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలకు డిప్యూటేషన్ పై తరలించడం పిల్లల చదువుకు ఆటంకంగా మారుతుందన్నారు. పాఠశాలలో 72 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 10 గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఓ ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు తరలిస్తే మా పిల్లల భవిష్యత్తు ఏమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సరిగ్గా స్పందించలేదని ఆవేదన చేశారు. ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ ను తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే విద్యార్థిని విద్యార్థులతో కడుతుల, పనసపుట్టు, టిక్రపడ, లుక్కూరు, జోడీపుట్టు, కమ్మరిగుంట, పోలిపుట్టు, కులబీరు, చిలిపుట్టు, కొద్దొంపుట్టు తొమ్మిది గ్రామాల నుండి చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మండల విద్యాశాఖ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసా కార్యదర్శి కిముడు రామదాసు, కృష్ణ, శంకర్, రాంబాబు, నాగేష్, జగ్గు, గణపతి, గోవర్ధన్, సుశీల, చంద్రకళ, జుర్లోయి లైబాన్, పరశురాం, రాందేవ్, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ

- కుర్చీలు, వాటర్ టీన్, డస్ట్ బిన్ లను ఉచితంగా అందజేత.
- ఉపాధ్యాయుడు పూజారి ఉపేంద్ర.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 21.** చదువుపై ఆసక్తి కలిగించేందుకు తన సొంత ఖర్చులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర విద్య సామాగ్రిని అందించిన ఉపాధ్యాయుడు అనేకులకు ఆదర్శంగా నిలిచారు. అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, పెద్దగూడ పంచాయతీకి చెందిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల పనసలో అదే గ్రామానికి చెందిన పూజరి ఉపేంద్ర (హిందీ మాస్టారు) తన సొంత ఖర్చులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్ను పెన్సిల్లు, పాఠశాలకు సంబంధించిన విద్య సామాగ్రిని ఉచితంగా అందించారు. పాఠశాలలో కుర్చీలు, వాటర్ టిన్, డస్ట్ బిన్ వంటి వస్తువులను అందజేయడం పట్ల పనస పాఠశాల ఉపాధ్యాయురాలు సత్యవేణి ఉపేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగస్తులు ఇటువంటి కార్యక్రమంలో పాలిభాగస్తులు అవ్వాలని, ఉపాధ్యాయుడు ఉపేంద్ర చేసిన మంచి పని పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పూజారి గోవిందరావు, గ్రామ పెద్దలు పూజారి సోమేష్ కుమార్, పూజారి లక్ష్మణరావు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన ప్రథమ కర్తవ్యం

రాజాన వీర సూర్యచంద్ర




**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 21) :** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం జనసేన పార్టీ ప్రథమ కర్తవ్యమని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. మంగళవారం నర్సీపట్నంలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను వివరించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరి మాటలను ఓపికగా ఆలకించి, ఆయా సమస్యలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ధైర్యం చెబుతూ, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మదర్ తెరిసా కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు ఫిర్యాదు చేశారు. అలాగే పెన్షన్లు, విద్యుత్ సంబంధిత సమస్యలు తదితర ప్రజా సమస్యలపై పలు వినతిపత్రాలు అందజేశారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సూర్యచంద్ర తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా, వారి సమస్యలు పరిష్కారమయ్యేలా జనసేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పంచాద హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాతవరం ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు సూరి శేఖర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణకు సింహాచలం సిద్ధం..

- భక్తుల కోసం క్యూలైన్లలో కీలక మార్పులు
- నడక దూరం తగ్గింపు.. దర్శనం మరింత సులభం చేయడమే లక్ష్యం

**సింహాచలం, పెన్ పవర్ జూలై 21 :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఈసారి క్యూలైన్ల వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టారు. భక్తులు అనవసరంగా ఎక్కువ దూరం నడవకుండా, తక్కువ సమయంలో స్వామివారి దర్శనం పొందేలా ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు.

ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆలయ ప్రదక్షిణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత ఏడాది గిరి ప్రదక్షిణ సందర్భంగా ఎదురైన ఇబ్బందులను విశ్లేషించిన అధికారులు, ఈసారి క్యూలైన్ల మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గించాలని నిర్ణయించారు. ముఖ్యంగా కొండ చుట్టూ ప్రదక్షిణ పూర్తి చేసి ఆలయానికి చేరుకునే భక్తులు ఎక్కువ దూరం క్యూలైన్లలో నడవాల్సి రావడంతో అలసటకు గురయ్యారని గుర్తించిన అధికారులు, అందుకు అనుగుణంగా కొత్త మార్గాలను రూపొందిస్తున్నారు.

ఈ మార్పులతో భక్తులు నడిచే దూరం తగ్గడమే కాకుండా, దర్శనం కూడా వేగవంతంగా జరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

అలాగే జూలై 29న గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు మార్గదర్శకంగా ప్రధాన కూడళ్లన్నింటిలో దిశా నిర్దేశక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. కాలి నడకన వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన సూచనలు జారీ చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా ఈసారి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. గిరి ప్రదక్షిణకు హాజరయ్యే భక్తులు అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## గిరిజన నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి




- జిఓ నెంబర్3ను పునరుద్ధరణ, 1/70చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి.
- ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నరసయ్య.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 21.** గిరిజన సంఘం నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, గిరిజన హక్కుల కోసం ప్రశ్నించే నాయకులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం ముంచంగిపుట్టు మండల కార్యదర్శి కొర్ర నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జీవో నంబర్ 3 పునరుద్ధరణ, 1/70 చట్టం అమలు కోసం అల్లూరి జిల్లా పాడేరులో గిరిజన గర్జనలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా గిరిజనులకు కల్పించిన హక్కులు పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే దాని కాలరాస్తుంటే గిరిజనులు ఏకమై ప్రభుత్వాన్ని నిలదీయాలని పేర్కొన్నారు. చట్టాన్ని అమలుచేయని అధికారులపై చర్యలు తీసుకోకుండా, చట్టాన్ని అమలు చేయాలని కోరిన వారిపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని, జిఓ నెంబర్ 3ను పునరుద్ధరణ చేయాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లేనిపక్షంలో గిరిజనుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి జీనబందు, కె డొంబురు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయవలసిందే.



**తప్పుడు కేసులకు భయపడేది లేదు.**

**గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి.**

**చింతపల్లి పెన్ పవర్ జూలై 21.**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసీలకు ఇచ్చిన హామీని జీవో నెంబర్ 3 కి ప్రత్యామ్నాయంగా జీవోను ఈ నెల 24వ తేదీ లోపు అమలుకు ఉత్తర్వులు ఇవ్వవలసిందేనని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17న అల్లూరి జిల్లాలో జరిగిన చలో పాడేరు మహా ధర్నాలు కొందరు నేతలు చేసిన ఆవేశ పూరిత వ్యాఖ్యలపై జిల్లా ఎస్పీ అమిత్ బర్డ్ చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రకటించి 18 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. ఇవన్నీ తప్పుడు కేసులని తక్షణమే కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల ఆస్తులు కనుక వాటిని ధ్వంసం చేయడం ఆదివాసి ఉద్యమ విధానం కాదన్నారు. మహా ధర్నాకు వస్తున్న ఆదివాసీలను పోలీసులు ఔట్ పోస్టులు పెట్టి తనిఖీలు చేసి ధర్నాకు రాకుండా అడ్డుకోవడం దారుణం అన్నారు . మహా ధర్నాకు అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతనే శాంతింగా ఆదివాసీలు ధర్నాలో పాల్గొన్నారు ఉద్యమ నాయకుల పై తప్పుడు కేసులు బనాయించి రోడ్లు బ్లాక్ చేసి అనుమతులు లేవని పోలీసు విధులకు అడ్డంకి కలిగించారని తప్పుడు కేసులు పెట్టారన్నారు దీన్ని ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో అక్రమ సర్వేలు చేసిన వారిపై 1/70 చట్టం ఉల్లంఘనలపై కేసులు నమోదు చేయడానికి శ్రద్ధ లేని ప్రభుత్వం ఆదివాసి ఉద్యమానికి మద్దతు ఇచ్చే ఆదివాసి ఉద్యమకారులను ఉద్యోగులను తప్పుడు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 1/70 చట్టం పరిరక్షణకు సుప్రీంకోర్టులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలన్నారు. 1/70 చట్టాన్ని రద్దు చేయాలని 1672 మంది గిరిజన ఇతరులు సుప్రీంకోర్టులో 2023లో పిటిషన్ దాఖలు చేశారన్నారు. నాటి నుండి నేటి వరకు కూడా కనీసం గత ప్రభుత్వము గాని ప్రస్తుత ప్రభుత్వం కానీ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతోని ఆదివాసి హక్కులు చట్టాల పరిరక్షణకు ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉన్నాయో తెలుస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలు అటవీ సహజ వనరుల దోపిడీకి ప్రయత్నాలు చేస్తున్నారని ఇటువంటి నేపథ్యంలో ఆదివాసి ప్రజలకు తీవ్ర ప్రమాదం పొంచి ఉన్న పరిస్థితి ఏర్పడిందన్నారు. 1/70 చట్టం రక్షణ ప్రథమ కర్తవ్యం అని అన్నారు ఆదివాసీల న్యాయమైన రిజర్వేషన్, భూమి హక్కులు, అటవీ హక్కులు, భయం పాలన హక్కులు సత్వరం మరియు సమూలంగా పరిష్కరించాలని కోరారు. అణచివేత బెదిరింపులు తప్పుడు కేసులు మాని సమస్యలు మూలాన్ని పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించాలని తమ కోరుతున్నామని లేనట్లయితే రాజ్యాంగపరమైన ఉద్యమాలు మరింత ఉధృతం చేసే ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు రాంబాబు, ఆర్ బాలకృష్ణ, వంతల రాజేశ్వరరావు పంచాయతీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులపై ప్రభుత్వం శీతకన్ను.

- కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పర్మినెంట్ కై జులై 30న చలో పాడేరు కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా జయప్రదం చేయండి. సిఐటియు





**హుకుంపేట పెన్ పవర్ జూలై 21 :**
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో జులై 30 తేదీన కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డైలీ వేస్ కార్మికులకు కనీస వేతన చట్ట సవరణ చేసి 26,000 చెల్లించాలని సిఐటియు అల్లూరు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు మంగళవారం పాడేరు ఆఫీస్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శివి. ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, జిల్లా కోశాధికారి ఎస్బి పోతురాజు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాయకులు, లక్ష్మణరావు, నాగరాజు, భూషణం తో కలిసి గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శివి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ. గత ఆరు సంవత్సరాలుగా కనీస వేతనం చట్ట సవరణ చేయలేదని దీంతో కార్మికులకు వేతనాలు పెరగలేదని అన్నారు మార్కెట్లో నిత్యవసర సరుకు ధరలు పెరుగుతున్నాయని కార్మికులు ఆర్థికఇబ్బందులతోసతమతమవుతున్నారని తెలిపారు. ఆప్కస్ లో పనిచేస్తున్న కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వటం లేదని అన్నారు. పని ఒత్తిడి పెంచుతున్నారని ఉద్యోగ భద్రత ఉండటం లేదని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 114 జీవో ప్రకారం అర్హులైన వారందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు. జిల్లాలో మెడికల్ అండ్ హెల్త్, జిసిసి, ఐటీడీఏ, ఏపీ టూరిజం, ఏపీ ఎఫ్ డి సి, ఫారెస్ట్, ఎన్ ఆర్ జి ఎస్, ఐకెపి, ఆర్టీసీ, విద్యుత్, గిరిజన గురుకులాలు, గిరిజన సంక్షేమ హాస్టల్స్ ఇతర ప్రభుత్వ శాఖలో సుమారు 25 వేలమంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ లో పని చేస్తున్నారని అన్నారు. తక్షణం 26000 వేతనం పెంచాలని, రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత గ్రాట్యుటీ, పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు జులై 30 తేదీన రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అల్లూరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అల్లూరి జిల్లాను జోన్-1లో కొనసాగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కూటమి నాయకుల కృతజ్ఞతలు

**జీవో నెం.3, 1/70 చట్టం అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హర్షం వ్యక్తం**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 2:**అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1 పరిధిలో కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లకు కొత్త వీధి మండల కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పొత్తురు కొండలరావు, జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లే వీర వెంకట ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. జిల్లాను జోన్-1లో కొనసాగించడం వల్ల స్థానిక గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో మరింత ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.అలాగే 2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ నియామకాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జీవో నెం.3 అమలుకు సంబంధించి చట్టపరమైన పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, గిరిజనుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.అదేవిధంగా షెడ్యూల్డ్ ఏరియాల్లో భూ రక్షణకు కీలకమైన 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. గిరిజనుల భూములు, హక్కులు, జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందన్నారు.గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా, ఉపాధి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బాక్సైట్ తవ్వకాల విషయంలో గిరిజనుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని, గిరిజనుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు ఉండవని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుని భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు, సంబంధిత మంత్రులకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు, జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లే వీర వెంకట్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, కూటమి నాయకులు దేశగిరి గోవిందరావు, ఊలం ఈశ్వరరావు, పాండురాజు, కుమారి, గంగాధర్, బాబురావు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న జడుమూరులో ఘనంగా రీసర్వే పట్టాల పంపిణీ

- 75 మంది లబ్దిదారులకు భూ హక్కుల పత్రాలు అందజేత





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 21:**మండల పరిధిలోని చిన్న జడుమూరు గ్రామంలో మంగళవారం భూముల రీసర్వే పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రీసర్వే ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం అర్హులైన 75 మంది లబ్ధిదారులకు భూ హక్కుల పట్టాలను అందజేశారు. రెవెన్యూ అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు మాట్లాడుతూ, భూ యజమానులకు శాశ్వత హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న సరిహద్దు వివాదాలను పరిష్కరించి, పారదర్శకంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి పట్టాలను సిద్ధం చేసినట్లు వివరించారు. భూములకు సంబంధించిన రికార్డులను రైతులు, లబ్ధిదారులు భద్రంగా సంరక్షించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొత్తూరు కొండలరావు, ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లే వీర వెంకట్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, సంకాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు, సంకట పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడు ఊలం ఈశ్వరరావు, పిసా కార్యదర్శి బాబురావు, కూటమి నాయకులు పాండురాజు, గంగాధర్, గ్రామ పెద్దలు దేశగిరి కృష్ణారావు, వలసన్న పడాల్, లింగమూర్తి, సంజీవరావు, స్థానిక రెవెన్యూ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పట్టాలు అందుకున్న రైతులు, లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## పత్రిక కథనాలతో నీటి సమస్య పరిష్కారం

- సమస్య పరిష్కారానికి మాకవరంలో పర్యటించిన అధికారులు.
- బోరుబావిని మరమ్మతు చేపట్టి అందుబాటులోకి తెచ్చిన మంచినీరు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 21.**70 కుటుంబాలు ఒకే బోరు, అందులో బురద నీరు అనే శీర్షికన ప్రచురితమైన పత్రిక కథనాలపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. మండలంలో గల మాకవరం పంచాయతీ కేంద్రంలో 70 కుటుంబాలు ఒకే బోర్ బావిలో బురద నీటిని గ్రామస్తులు సేకరించి ఉపయోగిస్తున్నారని వచ్చిన పత్రిక కథనాలపై మండల అభివృద్ధి అధికారి తక్షణమే స్పందించి గ్రామంలో సంబంధిత అధికారులను పంపించి బోరుబావి మరమ్మతులు చేపట్టి మంచినీటినీ గ్రామంలో అందించినట్లు టిడిపి నాయకుడు చెండా బాపూజీ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాకవరం గ్రామంలో 70 కుటుంబాలకు గాను ఒకే బోరుబావి కావటం, అందులో బురద నీరు రావటం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ విషయాన్ని పాత్రికేయుల ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందించమన్నారు. మంగళవారం హుటాహుటిన అధికారులు గ్రామంలో చేరుకునీ బోరుబావిని మరమ్మతులు చేపట్టి గ్రామంలో మంచి నీటిని అందుబాటులోకి తెచ్చారన్నారు. మరో వైపు గ్రామంలో మంచినీటి కల్పనకు పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తి చేస్తే నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. కాగా వార్త పత్రికలలో వచ్చిన కథనాలను చూసి వైసిపి మండల నాయకులు గొల్లోరి దేవా మాకవరం చేరుకొని నీటి సమస్యపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో మంచినీటి కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు బాపూజీకు, పాత్రికేయులకు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాకవరం పెసా ఉపాధ్యక్షులు డి పులందర్, గ్రామ పెద్దలు కే రాంబాబు, డి నారి, హరి బంధు, హీరన్న, ధోనియా, గంగా, సన్యాసిరావు, సీతారాం పడాల్, లోహిదాస్, కోటి, కృష్ణ పడాల్, ప్రహ్లాద్, స్వామి, తిరుపతి, కుమారి, తులమ్మ, గోరి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టిడిపి శ్రేణులు.



**అల్లూరి జిల్లాను జోన్1లో ప్రకటించినందుకు హర్షం.**

**అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు, సింహాచలం దేవస్థానం బోర్డుమెంబర్ చల్లంగి జ్ఞానేశ్వరి.**

**చింతపల్లి పెన్ పవర్ జూలై 21.** అల్లూరి సీతారామరాజు జిల్లాను జూన్ 1 లో ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అరకు పార్లమెంటు ఉపాధ్యక్షురాలు సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్ చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనుల పక్షపాతి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పటికీ కూడా గిరిజనుల మనోభావాలకు వ్యతిరేకం కాదన్నారు. జీవో నెంబర్3 బదులుగా ప్రత్యామ్నాయ జీవోను త్వరలో ప్రకటిస్తారన్నారు. గిరిజనుల చట్టాలు హక్కులు పరిరక్షణపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు ఎప్పుడు అండగా ఉంటుందని, గిరిజనులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. జిల్లాను జోన్ 1 కొనసాగించడం వల్ల గిరిజనులకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు.1/70 భూ బదలాయింపు చట్టానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజన హక్కులకు, భూములకు ఎటువంటి ప్రమాదం ఉండబోతున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చల్లంగి లక్ష్మణరావు, టిడిపి గ్రామ నాయకుడు రీమల ఆనందరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, బీసీ సెల్ అధ్యక్షుడు కాసిం వల్లి, జనసేన నాయకుడు వీరేంద్ర, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'వరుణ దేవుడా... కరుణించు' అంటూ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 21:**మండలంలోని కే. కోడిసింగి గ్రామంలో సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ గ్రామస్తులు గ్రామదేవతలకు సంప్రదాయ పద్ధతిలో వారదులు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి నార్లు ఉడుపు దశకు చేరుకున్నప్పటికీ వర్షాభావం కారణంగా పంట భవిష్యత్తుపై రైతుల్లో భయం నెలకొంది. సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో పంటలను ఎలా కాపాడుకోవాలనే ఆందోళనలో రైతులు ఉన్నారు.ఈ నేపథ్యంలో గ్రామ మహిళలు, రైతులు కలిసి గ్రామదేవత ఆలయం వద్ద వారదులు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. "వరుణ దేవుడా... కరుణించు, కనికరించు... సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతులను ఆదుకో" అంటూ భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.త్వరలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కష్టాలు తొలగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## జీకే వీధి మండల బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పాంగి శోభారాణి నియామకం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 21**భారతీయ జనతా పార్టీ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళలకు రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పిస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పీ.వి.ఎన్. మాధవ్, జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ మోర్చాల నియామక ప్రక్రియ చేపట్టారు.ఈ సందర్భంగా గూడెంకొత్తవీధి మండల బీజేపీ అధ్యక్షుడు కాకూరు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో, మండలంలోని రింతాడ టేకులవీధి గ్రామానికి చెందిన పాంగి శోభారాణిని గూడెంకొత్తవీధి మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమిస్తూ ప్రకటించారు.2016లో భారతీయ జనతా పార్టీలో చేరిన శోభారాణి, సాధారణ కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యాక్టివ్ సభ్యురాలిగా సేవలందిస్తున్నారని నాయకులు తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేయడంతో పాటు రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించి, వారికి తగిన గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఆమె పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ రీమల రాజేశ్వరి మాట్లాడుతూ, మహిళలకు పార్టీ సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తోందని, తాను కూడా అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మండలంలో మహిళా మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.బీజేపీ సీనియర్ నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ, దేశం, సమాజం, ధర్మం కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ భారతీయ జనతా పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు రాజకీయ, విద్యా, వ్యాపార రంగాల్లో సమాన అవకాశాలు కల్పించే దిశగా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.పాంగి శోభారాణి నియామకాన్ని మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి చల్లంగి అచ్యుత్, నాయకులు ముట్టడం లక్ష్మణ్, లకే రామ్, లక్కీ ప్రసాద్, కరణం రామచంద్ర, గౌడు సతీష్ దొర, ఆర్. పాల్, బూడిద తారాలమ్మ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే ను కలిసిన విద్యుత్ ఉద్యోగులు





**గాజువాక: పెన్ పవర్, జులై 21:**2004 లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీవో నెంబర్ 53 ద్వారా పాత పెన్షన్ విధానం వర్తింపజేసిన 1-2-1999 నుండి 31-8-2004 వరకు విద్యుత్ సంస్థలోని ఉద్యోగులకు కూడా అమలు చేయాలనీ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జోన్-2 ఉద్యోగులు కోరారు.ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని కలిసి వినతిపత్రం సమర్పించారు.బ్రాంచి అధ్యక్షుడు జె.అప్పలరాజు,కార్యదర్శి బుద్దా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు.సమస్యలపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించారని విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో పాటు విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారని అన్నారు.అంతకుముందు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర నాయుడు,డిస్కమ్ వైస్ పెసిడెంట్ ఏదురు అప్పలరాజు, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీ డి.అప్పారావు,ఏదుర అప్పలరాజు,మాజీ కోపరేటివ్ డైరెక్టర్ ఎస్ హరనాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు

## టీబీ ముక్తభారత్ అవగాహన కార్యక్రమం



**గాజువాక : పెన్ పవర్, జులై 21**

జివియంసి 66 వార్డులో టీబీ నిర్మూలన గురించి గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీబీ ముక్తభారత్ అవగాహన కార్యక్రమం అజీమాబాద్ శివాజీ నగర్ ప్రాంతంలో నిర్వహించారు.

స్థానిక ప్రజలకు టీబీ గురించి అవగాహన చేస్తూ వారికి ఉచితంగా చెస్ట్ ఎక్స్రే లు తీశారు .ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా 66 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు. విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాంబాయి ముస్లిం మైనార్టీ నాయకుడు అన్సర్ వల్లి 66 వార్డు మాజీ అధ్యక్షుడు స్వర్ణపుడి సత్యనారాయణ, రమేష్, ఆర్పీ లీలారాణి, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసపు పండగ ఘనంగా నిర్వహణ

**అత్యంత వైభవంగా ఆషాఢ జాతరను జరుపుకున్నా గిరిజనులు.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 21.** గిరిజనులు ఆషాఢ మాసం పండగను ఘనంగా నిర్వహిస్తారు. గిరిజనులు వర్షాకాలం ప్రారంభంలో ప్రకృతిని, అటవీ దేవతలను పూజించడానికి ఈ పండుగను జరుపుకుంటారు. ముంచంగిపుట్టు మండలంలో మంగళవారం ఆషాఢ జాతరను ఘనంగా నిర్వహించారు. సుజనకోట, బోడిపుట్టు, కడుతుల గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా అత్యంత వైభవంగా ఆషాడ జాతరను జరుపుకున్నారు. ప్రకృతిని నమ్ముకుని జీవించే వారు కాబట్టి వర్షాలు బాగా పడాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. పశుసంపద వృద్ధి చెందాలని, ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా ఉండాలని పూజించారు. గ్రామ ప్రజలు కలిసి ఆషాడ జాతరలో గ్రామ దేవతలకు సమర్పించిన వాటిని వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

## మాత శిశు సంక్షేమ సేవల అవగాహన సదస్సు



**గాజువాక : పెన్ పవర్, జులై 21:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో మాతా-శిశు సంక్షేమ సేవల ధృవీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ అధికారి జి. శేషిభూషణ్ , బి.ఎస్. వర్ధన్ శ్రామిక నగర్--03 సచివాలయ పరిధిలో గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారుల ఇళ్లకు ప్రత్యక్షంగా వెళ్లి మాతా-శిశు సంక్షేమ సేవల అమలును పరిశీలించారు. వారికి ఆరోగ్యం ,విద్య అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి అవగాహనకల్పించారు. ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలకు పలు ఆరోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్. శ్రీనివాస్ , డాక్టర్ సి.హెచ్. బదరి నారాయణమూర్తి , ఎంపీహెచ్ఈఓ సి.హెచ్.ఎస్.ఈ. అచ్యుతరావు , సూపర్వైజర్లు గండేపల్లి రాము , ఎస్. రత్నాలు , ఏఎన్ఎం కె. రామలక్ష్మి , ఆశా కార్యకర్త పి. సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆకాంక్షకు నెరవేర్పు.. జోన్-1లోనే అల్లూరి జిల్లా

- కూటమి ప్రభుత్వ నిర్ణయానికి డాక్టర్ వంపూరు గంగులయ్య హర్షం
- వైసీపీ హయాంలో జరిగిన పొరపాటును సరిదిద్దిన కూటమి ప్రభుత్వం



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 21:** అల్లూరి సీతారామరాజు జిల్లాను యథావిధిగా జోన్-1లో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య స్వాగతించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన, జోన్ల విభజనలో జరిగిన పొరపాట్లను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో అల్లూరి జిల్లాను జోన్-1లో కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం గిరిజనుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నదేనని పేర్కొన్నారు. జిల్లాల విభజన సమయంలో పాడేరు, అరకు నియోజకవర్గాలను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జోన్-1లోనే కొనసాగించాలని తాము అప్పట్లోనే డిమాండ్ చేసినప్పటికీ, అప్పటి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ను కలిసి అల్లూరి జిల్లాను జోన్-1లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆ సందర్భంగా ఇద్దరు నాయకులు సానుకూలంగా స్పందించారని, ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. అదేవిధంగా జీవో నెం.3 పునరుద్ధరణ లేదా ప్రత్యామ్నాయ చట్టపరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని కూడా ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, 1/70 చట్టం అమలుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల విషయంలో గిరిజనుల అభిప్రాయానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలు వ్యతిరేకిస్తే అనుమతులను పునఃసమీక్షిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం కూడా హర్షణీయమని గంగులయ్య పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాభిప్రాయాలకు అనుగుణంగానే పాలన కొనసాగుతోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్లకు గిరిజనుల తరఫున డాక్టర్ వంపూరు గంగులయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# నైపుణ్యాలే ఉపాధికి మెట్టు: ఉపకులపతి రాజశేఖర్

**ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పిఎం కౌశల్ వికాస్ యోజన 4.0, వేసవి శిక్షణ ధ్రువపత్రాల ప్రదానం**



**విశాఖ తూర్పు పెన్ పవర్, జులై 21:** నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అత్యవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ అన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం వృత్తి ప్రణాళిక మరియు అభివృద్ధి కేంద్రం, ఆంధ్ర విశ్వవిద్యాలయం - ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీమెన్స్ శ్రేష్ఠత కేంద్రం సంయుక్తంగా సోమవారం పిఎం కౌశల్ వికాస్ యోజన 4.0 శిక్షణ, వేసవి శిక్షణ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు ధ్రువపత్రాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి నేటి కాలంలో చాలా కీలకమని తెలిపారు. వీటిని పాఠ్యాంశాల్లో భాగంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో చూపుతూ మరింత ప్రావీణ్యం సాధించాలన్నారు. వర్చువల్ ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక అనుభవాన్ని కూడా సంపాదించి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంజనీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎం. శశి మాట్లాడుతూ, ఉపాధి కల్పన, మెరుగైన ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు నిరంతరం ఇటువంటి శిక్షణ కార్యక్రమాల్లో భాగం కావాలని, అంతర్జాలం ద్వారా నిర్వహించే శిక్షణ కార్యక్రమాలకు కూడా హాజరు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వృత్తి ప్రణాళిక మరియు అభివృద్ధి కేంద్రం సంచాలకులు ఆచార్య వజీర్ మహ్మద్, ఆచార్య ప్రజ్ఞ తదితరులు పాల్గొని ప్రసంగించారు. చివరగా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు.

# బాలికల గురుకుల పాఠశాల యధావిధిగా కొనసాగించాలి



- మేహాద్రిగడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆందోళన
- సోషల్ వెల్ఫేర్ డిసిఒ రామకృష్ణను అడ్డుకున్న విద్యార్థి సంఘం నాయకులు.

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 21:** ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మేఘాద్రి గడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గుంటూరు పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లితండ్రులను విద్యార్థులను కలుపుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భం గా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి తేజ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఎంతోమంది దళిత పేద విద్యార్థులను ఉన్నతమైన స్థాయికి చేర్చిన మేహాద్రిగడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను పూర్తిస్థాయిలో మూసివేసే ప్రక్రియ జరుగుతుందని అందులో భాగంగానే ఐఐటి-జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం లేకుండా కొంత మంది విద్యార్థులను ఇతర గురుకులాలు తరలించడం అన్యాయం అన్నారు. ఇప్పటికే ఇతర గురుకుల పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ఈ పిల్లలు వెళ్లడంతో మరింత ఇబ్బందులు కలుగుతున్నాయని విద్యార్థులు తెలిపారని అన్నారు. ఐఐటి-జేఈఈ నీట్ కోచింగ్ కి తాము వ్యతిరేకం కాదని వాటికి వేరే ప్రత్యేకమైన నూతన భవనాలు కేటాయించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులతో కాకుండా ప్రభుత్వమే ప్రత్యేకమైన ఐఐటి,నీట్ ఉపాధ్యాయుల నోటిఫికేషన్ విడుదల చేసి బోధన మొత్తం ప్రభుత్వ ఆధీనంలో జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈరోజు ఆందోళన చేయడంతో కొంతమంది విద్యార్థులను తిరిగి అదే పాఠశాలలోకి చేర్చుకున్నారని మిగతా విద్యార్థులను కూడా చేర్చుకొని గతంలో మాదిరి యధావిధిగా పాఠశాలలను కొనసాగించాలని కోరారు. ఇప్పటికే గూగుల్, ఆదాని డేటా సెంటర్ కి 99 పైసల్ కి ప్రభుత్వ భూమిని ఇస్తున్నారని ఐఐటి-నీట్ ప్రత్యేక తరగతులకు నూతన భవనాల కోసం భూమి కేటాయించలేరా అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్య శాఖ మంత్రి లోకేష్ స్పందించి మేహాద్రిగడ్డ గురుకుల పాఠశాలను కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను తల్లిదండ్రులను ఐక్యం చేసి మరింత పోరాటాలకు శ్రీకారం చుడదామని హెచ్చరించారు. అనంతరం డిసిఓ రామకృష్ణకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్, సహాయ కార్యదర్శి దేవి మౌలిక, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, నాయకులు హారిక, ముఖేష్ ,సాయి ,గంగాధర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభు,కౌశిక్,ఐద్వా నాయకురాలు రమణి, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల ఆత్మగౌరవం కోసం వైసీపీ పోరాటం - టీడీపీ వైఫల్యాలపై విశాఖలో భారీ నిరసన



**జగన్ ఆదేశాలతో జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**విశాఖ తూర్పు,పెన్ పవర్ జూలై 21:** రాష్ట్రంలో మహిళల భద్రతకు విఘాతం కలుగుతోందని, తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం విశాఖ ఎల్.ఐ.సి జంక్షన్ వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి. ఈ నిరసనకు నేతృత్వం వహించారు.

ఈ సందర్భంగా పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ. మాట్లాడుతూ జగన్ గారి హయాంలో మహిళల రక్షణ కోసం దిశ చట్టం, దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా ఫిర్యాదులు స్వీకరించడం లేదని, గుంటూరు, బద్వేలు ఘటనలు రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందనడానికి నిదర్శనమన్నారు. మహిళలకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె. రాజు. మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని ప్రభుత్వం మరిచిందని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని, నిందితులు ఎవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ గారు మహిళలకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ మేయర్ గోలగాని హరి వెంకట్ కుమారి, మాజీ జిసి చైర్మన్ శోభ స్వాతి రాణి, శ్రీదేవి వర్మ, ఉమ్మడి స్వాతి, సాది పద్మారెడ్డి, బెందాళం పద్మావతి, బయ్యవరపు రాధ, మల్లా ధనలత తదితరులు పాల్గొన్నారు.

# టి. మామిడాడలో రూ.36 లక్షల విలేజ్ హెల్త్ క్లినిక్‌కు శంకుస్థాపన

- ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట
- మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు, పెన్ పవర్ జూలై 21:** రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం టి. మామిడాడ గ్రామంలో రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిర్మాణ పనులు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తూ గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. టి. మామిడాడలో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, తల్లి--శిశు సంక్షేమ సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని మంత్రి వివరించారు. గ్రామాల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో అవసరమైన ఆరోగ్య సౌకర్యాలను కల్పిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహనాయుడు, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ,కోట తాతబ్బాయి, కొల్లు వెంకటేశ్వరరావు,ఎంపీటీసీ గొల్లపల్లి సింహాద్రి, కూటమి నాయకులు వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, ఫణి, గ్రామ పెద్దలు, వైద్యశాఖ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతు క్షేమమే సొసైటీల కర్తవ్యం : ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 21:** రైతులక్షేమమే సొసైటీల ప్రధాన కర్తవ్యమని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో, సొసైటీ చైర్మన్ సిద్ధ వీర్రాజు ఆధ్వర్యంలోఎరువుల విక్రయ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరించి తగిన తోడ్పాటు అందించాలని అన్నారు. తాడేపల్లిగూడెం సహకార సంఘం 34 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రైతులకు ఎరువుల విక్రయాలను ప్రారంభించామని తెలిపారు. బిజెపి ఇన్చార్జి ఈతకోట తాతాజీ మాట్లాడుతూ , రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ ఇన్‌పుట్లను సొసైటీల ద్వారానే అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఎరువులపై భారీ సబ్సిడీ అందిస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.
తాడేపల్లిగూడెం సొసైటీలో ఎరువుల విక్రయాలు ప్రారంభం కావడం వల్ల పరిసర ప్రాంతాల రైతులు అవసరమైన ఎరువులను స్థానికంగానే సులభంగా పొందే అవకాశం కలుగుతుందని, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలకు రూ.10 లక్షలు భారీ విరాళం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 21:** ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణం కోసం శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులు రూ.10,00,000 లు భారీ విరాళం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి 4 విధానంలో నిర్మిస్తున్న ఈ జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యేతో పాటు వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం 10 లక్షలు ప్రకటించారు తొలి విడతగా రూ.5,00,000లు, ఇచ్చారు,
చలంచర్ల మురళి 10 లక్షల రూపాయలు ప్రకటించారు తొలివిడతగా రూ.2,00,000లు విరాళం ఇచ్చారు, మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జూనియర్ కళాశాలకు ఎంతో కాలంగా సొంత భవనం లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యను తమ హయాంలో పరిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎందరో ప్రముఖులు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. విద్య కోసం చేసే వ్యయం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలనే ఉద్దేశంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నన్నయ విశ్వవిద్యాలయం వద్ద క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా మంత్రి లోకేష్ లు విద్యారంగంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరగాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ముడి పొగాకుపై జీఎస్టీ తగ్గించాలి

- **కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి ఎంపీ పురంధేశ్వరి వినతి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 21:** పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని రాష్ట్ర ప్రజా ప్రతినిధులు, సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి, ముడి పొగాకు (ఎచ్ ఎస్ ఎన్ 2401) పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 కు తగ్గించాలని కోరుతూ మంగళ వారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వినతిపత్రం అందజేసారు.
ప్రస్తుతం అమలులో ఉన్న జీఎస్టీ కారణంగా రాష్ట్రంలోని ఎఫ్ సీ వి పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.
ముడి పొగాకు కు సంబంధించిన అంశమే తప్ప, తయారైన పొగాకు ఉత్పత్తులకు సంబంధించి నది కాదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. జీఎస్టీ తగ్గింపు ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు, భారత పొగాకు ఎగుమ తుల పోటీతత్వం అంతర్జా తీయ మార్కెట్‌లో మరింత బలోపేతం అవుతుందని వివరించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో టీడీపీదే కీలక పాత్ర

- **జీవో నంబర్--3 రద్దుకు వైసీపీ ప్రభుత్వమే కారణం**
- **మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు**




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 21:** గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు విశేష కృషి చేశాయని తెలిపారు.జీవో నంబర్--3 అమలు నిలిచిపోవడానికి అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. 2020లో జీవో నంబర్--3పై సుప్రీంకోర్టులో విచారణ జరిగిన సమయంలో అప్పటి ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు వినిపించకపోవడంతో గిరిజనులు తమకు ఉన్న కీలకమైన అవకాశాన్ని కోల్పోయారని విమర్శించారు.ప్రస్తుతం జీవో నంబర్--3పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నప్పటికీ, వారు అధికారంలో ఉన్న నాలుగేళ్ల కాలంలో ఈ అంశంపై ఎలాంటి గట్టి చర్యలు తీసుకోలేదని సీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో గిరిజనుల సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం జీవో నంబర్--3 అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు.గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి విషయంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. జీవో నంబర్--3కు ప్రత్యామ్నాయంగా గిరిజనులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రయోజనం కలిగే విధంగా కొత్త విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గిరిజనుల హక్కులకు రక్షణ కల్పిస్తూ, వారి అభివృద్ధికి మరింత ఊతమిచ్చే విధానాల రూపకల్పనకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని సీతంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయంలో "స్పార్క్ 3.0" పారిశ్రామిక అన్వేషణ బూట్‌క్యాంప్








**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 21:**డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు రాజమహేంద్రవరంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో యువ వ్యవసాయ ఆవిష్కర్తల్లో పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఐదు రోజుల "స్పార్క్ 3.0 -- ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎక్స్‌ప్లోరేషన్ బూట్‌క్యాంప్" నేడు ఘనంగా ప్రారంభమైంది. జూలై 21 నుండి 25, 2026 వరకు నిర్వహించబడనున్న ఈ శిక్షణా కార్యక్రమం వేంకటరామన్నగూడెంలోని డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాల ప్రాంగణంలోని హార్టీ-బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ లో జరుగుతోంది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కె. ధనుంజయరావు మాట్లాడుతూ, భారతదేశంలో ఆధునిక ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధికి విశేష సేవలందించిన రతన్ టాటా కృషిని స్మరించారు. గతంలో వివిధ విశ్వవిద్యాలయాల మధ్య ఏర్పడిన ఫలవంతమైన భాగస్వామ్యాలను ప్రస్తావిస్తూ, ఈ బూట్‌క్యాంప్ ఆ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి ఆకాంక్షించిన "ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త" అనే లక్ష్య సాధనకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల డీన్ డా. బి. ప్రసన్న కుమార్, విద్యార్థి వ్యవహారాల డీన్ డా. సి. మధుమతి, పారిశ్రామిక మరియు అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకురాలు డా. టి. పద్మలత, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎన్.బి.వి. చలపతిరావు, హెచ్‌బీఐసీ అధిపతి, విస్తరణ విద్య ప్రొఫెసర్ డా. ఈ. కరుణశ్రీ తదితరులు పాల్గొని ఉద్యాన రంగంలో పారిశ్రామిక అవకాశాలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.
ఈ బూట్‌క్యాంప్‌కు ఎంపికైన విద్యార్థులు తమ ఆలోచనలు, లక్ష్యాలను పంచుకుంటూ, ఈ శిక్షణ తమలో పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి విలువైన అవకాశాన్ని కల్పించిన విశ్వవిద్యాలయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వరదలపై,ముందస్తు చర్యలు చేపట్టాలి.




**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.21**
మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు,గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ముందస్తు చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.మండలంలోని రేఖపల్లి,మండలప్రజా పరిషత్,కార్యాలయం సమావేశపు,హాలోమంగళవారం ఎంపీపీ కారంలక్ష్మి,మండలతహసీల్దార్,సరస్వతి, జడ్పీటీసీ వాళ్ల రంగా రెడ్డి,ఆధ్వర్యంలో వరద సహాయక చర్యలు,మరియు పునరావాస ఏర్పాట్లు,అత్యవసర సేవలుపై,సమావేశం నిర్వ హించారు.ఈ సమావేశంలో మండల స్థాయి,సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొని,వరదల సమయంలో ఎదురయ్యే సమస్యలు,పరిష్కరచేసే,దిశగా మాట్లాడారు వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సంబంధిత,అధికారులుపనిచేయాలని,తెలిపారు.అనంతరం వైద్యం, విద్యుత్తుసమస్యలపై అధికారులను ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్,ప్రశ్నించారు.గతంలో వర దల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యలు విద్యుత్తు అంతరాయం,వైద్య సేవలు అందించడంలో కొరత ఏర్పడిందని,గుర్తు చేశారు.గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు చీకట్లో మగ్గిపోయాయని,చిన్నపిల్లలు,వృద్ధులు,గర్భిణీ స్త్రీలు,నానాఇబ్బందులుపడ్డారని,అన్నారు.వరదల సమ యంలోఅత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పూనెం ప్రదీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.వరద ప్రభా విత ప్రాంతమైన పెద్దమట్టపల్లి సెంటర్‌లో వెంటనే ఒక ప్రత్యేక వైద్యుడిని నియమించాలని,డిమాండ్ చేశారు. వరదల సమయంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉన్న సోములగూడెం గ్రామంలో కూడా ప్రత్యేకంగా మరో డాక్టర్‌ను నియమించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ప్రతి గ్రామంలో వరద బాధితుల సమగ్ర జాబితా సిద్ధం చేయాలని,బొర్రా నరేష్ కుమార్,పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్ కుమార్ మాట్లాడుతూ,వరద నిర్వహణలో సమగ్ర సమాచారం అత్యంత కీలకమని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో ఎంతమంది వరద బాధితులు ఉన్నారు, ఇంకా పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన వారు ఎంతమంది ఉన్నారు, ప్రత్యేక సహాయం అవస రమైన కుటుంబాలు ఎన్ని ఉన్నాయో పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.
అలాంటి జాబితా ఉంటే ప్రతి గ్రామానికి అవసరమైన మందులు, తాగునీరు, ఆహారం, నిత్యావసర వస్తువులు, వైద్య బృందాలను సమర్థవంతంగా పంపిణీ చేయడం సులభమవుతుందని చెప్పారు. వరద నిర్వహణలో సమాచార లోపం ఉండకూడదని, ప్రతి గ్రామాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పది రోజుల్లో నష్టపరిహారం ఖాతాల్లో జమ్మచేయాలని,గత వరదల్లో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం మరో పది రోజుల్లో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారిక సమాచారం అందిందని బొర్ర నరేష్ కుమార్ వెల్లడించారు. అర్హులైన ప్రతి బాధితుడికి నష్టపరిహారం తప్పకుండా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పడవ యజమానుల బకాయిలు వెంటనే చెల్లించాలి వరద సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషించే పడవ యజ మానులకు గతంలో ఇవ్వాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉండటం సరైన విషయం కాదని నరేష్ కుమార్ అన్నారు. బకాయిలు వెంటనే చెల్లిస్తేనే భవిష్యత్తులో ఆపద సమయంలో వారు మరింత ఉత్సాహంగా సేవలు అందిస్తారని పేర్కొన్నారు.ఈ విషయంలో ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి,మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, మండల స్థాయి అధికారులు,వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు,వివిధపార్టీలనాయకులు, తదితరులు,పాల్గొన్నారు.

# అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో కరోనా మరియు వర్షాకాల వ్యాధులపై అవగాహన సదస్సు..

**అడ్డతీగల, పెన్ పవర్,జూలై 21:**స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ పి. మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో కరోనా వైరస్ మరియు కాలా అనుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించరూ.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పీడియాట్రిషన్ (బాల వైద్య నిపుణులు) డాక్టర్ హర్ష ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు, ముఖ్యంగా ప్రస్తుత వర్షాకాలంలో చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలకు జలుబు, జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధుల నుండి రక్షణ పొందడానికి పిల్లల విషయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పౌష్టికాహార ప్రాముఖ్యతను ఆయన వివరంగా వివరించారు.

అనంతరం ఆసుపత్రి కౌన్సిలర్ వాసు మాట్లాడుతూ కరోనా మహమ్మారి పూర్తిగా అంతరించిపోలేదని, ప్రస్తుతం ఆ మహమ్మారి విజృంభించడానికి సిద్ధపడుతుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన అవసరమని, నిబంధనలు పాటించడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కౌన్సిలర్ వాసు తెలిపారు. భయపడకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలని కోరారు.ప్రస్తుతం రాజమండ్రి, కాకినాడ



ఆంధ్రప్రదేశ్ అంతట కొన్ని కేసులు ఉన్నాయి అని, కానీ అన్ని ప్రికాషన్స్ తీసుకొంటే ఆరోగ్యం కాపాడుకోవ్వచ్చు అని కౌన్సిలర్ వాసు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలపై దాడులు ఖండిస్తూ వైసీపీ మహిళలు నిరసన




**రాజమహేంద్రవరం, 10 పవర్, జులై 21:**కూటమి ప్రభుత్వంలో టిడిపి నేతలు రాష్ట్రంలో మహిళను వివస్త్రను చేసి వేధించిన ఘటనను ఖండిస్తూ తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టారు.ఈ ర్యాలీలో మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి , రంపచోడవరం నియోజవ ర్గం మాజీ ఎమ్మెల్యే నాగుల పల్లి ధనలక్ష్మి లతో కలిసి మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ ఆచంట నియోజకవర్గ పరిశీలకులు మేడపాటి షర్మిళ రెడ్డి పాల్గొన్నారు . మహిళలపై దాడులు అరికట్టాలని, చంద్రబాబు నాయుడు రాజీనామా చేయాలని , కూటమి ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షు రాలు మార్త లక్ష్మీ , మహిళ నాయకులు పోలు విజ యలక్ష్మి , మాజీ కార్పొరేటర్ చోడిశెట్టి సత్యవేణి , మాజీ చైర్పర్సన్ సంకిస భవాని , ఆచంట అనసూయ , సత్య , కృష్ణవేణి , సరిత , దేవి , సూర్య కుమారి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్, మండల స్థాయి పార్టీ మహిళలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైయస్ఆర్ సీపీ శ్రేణులు. భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు చేస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లు స్వాధీనం




**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 21:** నగర శివారు కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో నిర్వహించిన అధికారుల సంయుక్త తనిఖీలో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణాకు వినియోగిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం--2024 పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సమక్షంలో జిల్లా గనులు , భూగర్భ శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది, అర్బన్ తహసీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద సంయుక్త తనిఖీ నిర్వహించారు.

ఈ తనిఖీలో సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ పరిధిలో 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు.విచారణలో మూడు డ్రెడ్జింగ్ బోట్ల యజమానిగా నందూరి రాజు (మాదిగపల్లి, వైకుంఠపురం, గుంటూరు), మరో మూడు బోట్ల యజమానిగా ముత్యాల వెంకట రమణ (రామాలయం వీధి, విజ్జేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా), మరో మూడు బోట్ల యజమానిగా కూచిపూడి బాలస్వామి (గరుడాచలపాలెం, తకెళ్లపాడు, గుంటూరు జిల్లా) ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు డ్రెడ్జింగ్ బోట్లకు సంబంధించిన యజమానులు తనిఖీ సమయంలో గుర్తించక పోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నిర్ధారించారు. నూతన ఇసుక విధానం--2024 పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక త్రవ్వకాల కోసం వినియోగించినందున 13 బోట్లను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా తదుపరి క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

తనిఖీలో గుర్తించిన 13 డ్రెడ్జింగ్ బోట్లపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠిన శాఖాపర, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ సంయుక్త తనిఖీలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్. శివరాముడు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి, టెక్నికల్ అసిస్టెంట్ పి.ఎన్.వి.ఎల్. శైలజ, అర్బన్ తహసీల్దార్ యు. రంజిత్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ ఏఈఈ శివ, ఐసీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**సీతానగరం, పెన్ పవర్, జూలై 21:**వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా. చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మంగళవారం సీతానగరం మండలంలోని రాపాక గ్రామంలో పంట పొలాలను పరిశీలించి స్థానిక సొసైటీ వద్ద రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వరిలో పలు చీడపీడల నివారణకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించుకోవాలని అధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఇన్చార్జి సూర్య రమేష్, డి ఆర్ సి ఏ డి ఏ ఎస్ జయ రామలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ ఏవో ఏ. గౌరీదేవి, ఏ ఈ ఓ గురు ప్రియ, అగ్రికల్చర్ విఏఏలు ప్రవీణ్ అచ్యుత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ డిమాండ్

* నగరంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన సిపిఐ నాయకులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జూలై 21:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికి పేద ప్రజలకు అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం తాత్సారం చేయడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

జి ఈశ్వరయ్య ఎద్దేవా చేసారు. కార్మిక లోకానికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేకుంటే భూ పోరాటం ద్వారా తామే ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పంచి పెడతామని ఆయన తెలిపారు.

మంగళవారం స్థానిక నగరంలో 371 సర్వే నెంబర్ మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని ఆయనతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు, దోనేపూడి శంకర్ లు పరిశీలించారు. అనంతరం కార్మిక వర్గాన్ని ఉద్దేశించి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగామున్సిపల్ కార్మికులు ఈ స్థలాన్ని కార్మిక లోకానికి ఇవ్వాలని కోరుతున్న ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబి స్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వడం మర్చిపోయిందన్నారు టిడ్కో గృహాలపై చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. నవంబర్ నెలలో వేలాది మందితో ఇంటి గర్జన పేరుతో చలో విజయవాడ పిలుపు నిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాంబాబు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం వెంకటేశ్వ రరావు సిపిఐ నగర కార్యదర్శి

వి కొండల రావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల దుర్గమ్మ రాష్ట్ర కోశాధికారి రెడ్డి రమణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిటీ ప్రధాన కార్యదర్శి కాకి శారద జిల్లా నాయకులు బంగారు గిరి పోలమ్మ , సిటీ సహాయ కార్యదర్శి మీసాల దేవి మీసాల రమణ వీరబాబు రెడ్డి శ్రీనివాస్ జ్యోతి సరస్వతి తదితరులు పాల్గొన్నారు

## ప్రమాదంలో కోయ భాష.. పరిరక్షణ బాధ్యత అందరిపైనా



* **కోయ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలి**
* **ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్**

**గంగవరం, పెన్ పవర్ జూలై 21:** మాతృభాష పట్ల ఆదరణ తగ్గిపోవడంతో కోయ భాష ప్రమాదంలో పడిందని, భాషను కోల్పోతే సాంస్కృతిక ఉనికి, హక్కులను కోల్పోయినట్లేనని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వ గోండి--కోయ భాషా దినోత్సవం సందర్భంగా గంగవరం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కోయ భాష కేవలం సంభాషణకు ఉపయోగించే మాధ్యమం మాత్రమే కాదని, కోయ ఆదివాసీల వేలాది సంవత్సరాల చరిత్ర, జీవన విధానం, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని కుంజా శ్రీను పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరగడం, ఉద్యోగ, ఉపాధి కారణాలతో ఆదివాసీలు ఇతర ప్రాంతాల్లో స్థిరపడటం, మాతృభాషకు దూరమవుతుండటంతో కోయ భాష కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

ఆదివాసీ ప్రజలు తమ సొంత భాషలో మాట్లాడటానికి ఎలాంటి సంకోచం చెందకూడదని, మాతృభాషలో మాట్లాడటమే గర్వకారణమని పిలుపునిచ్చారు. ఇళ్లలో, పండుగల్లో, గ్రామాల్లో పిల్లలు, కుటుంబ సభ్యులతో కోయ భాషలో మాట్లాడాలని సూచించారు. ఇతర భాషలను నేర్చుకుని గౌరవిస్తూనే, తమ మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.అంతరించిపోతున్న కోయ భాషకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఆదివాసీ విద్యార్థులకు కోయ భాషలో ప్రాథమిక విద్యాబోధన అందించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తీగల బాబురావు, తెల్లం శేఖర్, యాళ్లగడ్డ నాగేశ్వరరావు, రామన్న దొర, చోడి ప్రదీప్ కుమార్ దొర, కంగాల అబ్బాయి దొర, పీత ప్రసాద్, అరుణకుమారి, దుర్గ భవాని, పరదా శివరామకృష్ణ, కలుమల ప్రసాద్ దొర, చోడి ఏడుకొండలరావు దొర, కోటం రాజన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా మంత్రి ధరేంద్ర రాజీనామా చేయాలని విద్యార్థుల ప్రదర్శన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 21:**నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు చేసిన లాఠీచార్జిని నిరసిస్తూ రాజీవ్ గాంధీ విద్యాసంస్థల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గణేష్ చౌక్ వద్ద నుంచి గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎంపీ జివి హర్షకుమార్ మాట్లాడుతూ విద్యార్థులపై కర్కశంగా లాఠీచార్జి చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు తాము మద్ధతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ధరేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు బయట పడతాయని, నిష్పాక్షితంగా విచారణ జరపాలని డిమాండ్ చేసారు. నీట్ పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలన్నారు. విద్యార్థులకు మద్ధతుగా ఆందోళన చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రి నుంచి విడుదల చేయాలని, డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, ధర్మేంద్ర ప్రదాన్‌ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేసారు. భవిష్యత్తులో ఇటువంటి అవకతవకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ రోగికి కుడుపూడి సత్తిబాబు ఆర్థిక చేయూత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జూలై 21:** నగరంలోని స్థానిక 3వ వార్డు రాజేంద్రనగర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త ధవలేశ్వరం పూర్ణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు దృష్టికి వచ్చింది. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని, రూ.5,000 విలువచేసే మందులను అందించారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం బాధ్యత అని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన న్నారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తిగతంగా కూడా తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానన్నారు. సత్తిబాబు అందించిన సహాయానికి ధవలేశ్వరం పూర్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com